క్లుప్తంగా

నేడు మంత్రి రోజా పర్యటన

నగరి : నియోజకవర్గంలోని వడమాలపేట మండలంలో మంత్రి ఆర్‌కే రోజా బుధవారం పర్యటించనున్నారు. ఉదయం 9 గంటలకు వడమాలపేట మండలం పూడి గ్రామంలో నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం కాయం గ్రామంలోని జగనన్న కాలనీలో 400 పైగా ఇళ్లను ప్రారంభోత్సవం చేస్తారు.

నేడు ప్రదోషకాల పూజలు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్‌ఎస్‌కండ్రిగ సమీపంలో ఉన్న అరుణగిరి కొలువైన శ్రీ జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో గురువారం సాయంత్రం ప్రదోష కాల పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు రమేష్ బుధవారం సాయంత్రం ఓ ప్రకటనలో తెలిపారు. ఏకకాలంలో నందీశ్వరుడికి, శివుడికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు జరుగుతాయన్నారు. అలాగే వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

నందీశ్వరుడికి ప్రత్యేక పూజలు

వెదురుకుప్పం: మండలంలోని చవటగుంటలో ఉన్న మీనాక్షి సమేత ఆవుదేవర నందీశ్వర స్వామి ఆలయంలో బుధవారం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా స్వామి వారి ఉత్సవమూర్తులను వేంచేపు చేసి పట్టు పీతాంబరాలు, సుంగధ పరిమళాలు వెదజల్లే వివిధ రకాల పుష్పాలతో ఆకర్షణీయంగా అలంకరించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో భక్తి ప్రపత్తులతో పూజలు చేశారు. మంత్రి పెద్దిరెడ్డి పేరిట అర్చనలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు. కార్యక్రమంలో వెలుగు ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పేట హరికృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ మాజీ మండల అధ్యక్షుడు ధనంజయరెడ్డి, సంతబయలు సర్పంచ్ రాజేశ్వరి, ఆలయ కమిటీ సభ్యులు స్వామినాథరెడ్డి, జయచంద్రా రెడ్డి, నాయకులు పెద్దిరెడ్డి రేణుక, సరోజమ్మ పాల్గొన్నారు.

సారా విక్రేత అరెస్ట్

పుత్తూరు రూరల్: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పరిధిలో బుధవారం నిర్వహించిన దాడుల్లో సారా కలిగి ఉన్న ఓ వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఇన్‌చార్జ్ సీఐ హేమంత్‌కుమార్ తెలిపారు. నారాయణవనం మండలం ఎరికంబట్టు గ్రామ అటవీ ప్రాంతంలో ఎస్.అర్జున్‌రెడ్డిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 3 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, రిమాండ్‌కు తరలించారు. దాడుల్లో డీటీఎఫ్, ఎస్‌ఈబీ ఎస్‌ఐలు నరసింహులు, నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

శాశ్వత భూహక్కుపై అవగాహన

పుత్తూరు రూరల్: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న శాశ్వత భూహక్కు పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని శిరుగురాజుపాళెం గ్రామ సర్పంచ్ మురళీయాదవ్ కోరారు. బుధవారం గ్రామ పంచాయతీ భవనంలో శాశ్వత భూహక్కు పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ జె.పరమేశ్వరస్వామి భూరీసర్వే గురించి వివరించారు. కార్యక్రమంలో డీటీ స్వరూపారాణి, పంచాయతీ కార్యదర్శి హరిత, సర్వేయర్ శేషమరాజు, వీఆర్‌ఓ ఫిరోజ్ పాల్గొన్నారు.

15 నుంచి వేపంజేరి బ్రహ్మోత్సవాలు

గంగాధర నెల్లూరు: మండలంలో వేపంజేరి లోని ప్రముఖ శ్రీలక్ష్మీ నారాయణస్వామి ఆలయంలో ఈనెల 15 నుంచి 24వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్టీ, ఫౌండర్ కేఎస్.శ్రీధర్, న్యాయ వాది వాసు, ఆలయ మేనేజర్ నల్లా వెంకటేశులు రెడ్డి తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ ఈనెల 15వ తేదీ అంకురార్పణ, 16న తిరుచ్చి ఉత్సవం , ధ్వజారోహణం ,శేష వాహనం, 17న హంస వాహనం, 18న సింహ వాహనం, 19న సూర్య, చంద్రప్రభ వాహన సేవలు, 20న గజ వాహనం, 21న మోహినీ అవతారం, గరుడ సేవ, 22న హనుమంత వాహనం, 23న రథోత్సవం, అశ్వ వాహన సేవలు జరుగుతాయని వివరించారు. 24న చక్రస్నానం ద్వాదశరాధనం, ధ్వజావ రోహణంతో ఉత్సావాలు ముగుస్తాయని తెలిపారు.

ప్రతి ఒక్కరూ చదువుకోవాలి

పుత్తూరు రూరల్: ఐదేళ్ల నుంచి 18 ఏళ్ల వయస్సు వరకు ప్రతి ఒక్కరూ విధిగా చదువుకోవాలని డీఈఓ శేఖర్ తెలిపారు. బుధవారం స్థానిక వైఎస్సార్ సమావేశ మందిరంలో వెల్ఫేర్ అసిస్టెంట్లు, సీఆర్పీలకు సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పుత్తూరు విద్యాశాఖ పరిధిలో జీఈఆర్ సర్వే వేగవంతం చేయాలన్నారు. సర్వేలో బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి, అందరిని బడిలో చేర్పించాలని ఆదేశించారు. ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోయిన, మృతి చెందిన వారి వివరాలను వలంటీర్ యాప్ నుంచి తొలగించాలని సూచించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష సీఎంఓ సురేష్, మున్సిపల్ కమిషనర్ కెఎల్‌ఎన్‌రెడ్డి, ఎంపీడీఓ ప్రసాద్, ఎంఈఓలు తిరుమలరాజు, బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

సుస్థిర జీవనోపాధి చేసుకోవాలి

పాలసముద్రం : ప్రతి స్వయం సహాయక సంఘ సభ్యురాలు కూడా సుస్థిర జీవనోపాధి ఏర్పాటు చూసుకుంటూ ప్రతి నెల స్థిరమైన ఆదాయం వచ్చేటట్లు ప్రణాళికలు చేసుకోవాలని ఐకేపీ ఏపీఎం ఫరీద్ మస్తాన్ తెలిపారు. బుధవారం మండల మహిళ సమాఖ్య పరిధిలో సంఘమిత్రాలు, వీవో లీడర్లతో సమీక్ష నిర్వహించారు. ఐకేపీ ఏపీఎం ఫరీద్ మస్తాన్ మాట్లాడుతూ ప్రతి గ్రూప్‌నకు బ్యాంకు లింకేజీ రుణాలు రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు వడ్డీలేని రుణాలు తీసుకుంటున్నారని తెలిపారు. ఆర్థిక అక్షరాస్యత కలిగి ఉండాలన్నారు. అందుకు అనుగుణంగా వ్యక్తిగత పాస్ పుస్తకాలు గ్రూపు సమావేశ పుస్తకం ప్రతి మీటింగ్‌లోనే రాసుకుని అందరూ సంతకాలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీసీ చిరంజీవి, సంఘమిత్రాలు మురగయ్య, మంజుల, శోభ, వీఓ లీడర్లు పాల్గొన్నారు.

బహుభాషా పాఠ్యాంశం.. విద్యార్థులకు శ్రేయస్కరం

చిన్నారుల్లో విద్యావికాసం పెంపొందించేందుకు రాష్ట్రప్రభుత్వం చరిత్ర చూడని సహకారం అందిస్తోంది. నాడు–నేడు ద్వారా ఇప్పటికే ప్రభుత్వ స్కూళ్లను కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా ఆధునీకరించింది. అలాగే స్కూళ్లలో డిజిటల్ విద్యను అందుబాటులోకి తెచ్చింది. బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లు, చేతి వృత్తుల్లో నైపుణ్యం పెంపొందించి ప్రభుత్వం విద్యార్థులకు బాసటగా నిలుస్తోంది.మైనర్ భాషలు చదివే విద్యార్థులకు కూడా పాఠ్యాంశాలు సులభంగా అర్థమయ్యేలా బైలింగ్యువల్ (రెండు భాషల్లో పాఠ్యాంశాలు) విధానాన్ని అమలు చేస్తోంది.

- ఉపయోగపడుతున్న రెండు భాషల పాఠ్యాంశాలు
- మైనర్ భాషల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్న ప్రభుత్వం
- అన్ని అంశాలను ఇంగ్లిష్‌లో బోధిస్తుండడంతో సులువుగా అర్థం చేసుకుంటున్న విద్యార్థులు


చింతలపట్టెడ జెడ్పీ హెచ్‌ఎస్ పాఠశాలలో బైలింగ్యువల్ తమిళ పుస్తకాలు చూపుతున్న విద్యార్థులు


వేలావడి ఉర్దూ పాఠశాలలో బైలింగ్యువల్ పుస్తకాల ద్వారా బోధిస్తున్న టీచర్

నగరి : విద్యార్థులకు వారి మాతృభాషలోనూ, వారు ఎంచుకున్న మీడియంలో విద్య బోధించేలా వారికి పాఠ్యపుస్తకాలు అందుబాటులో వచ్చాయి. విద్యా సంస్కరణలకు పెద్దపీట వేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అట్టడుగు వర్గాల చిన్నారులు సైతం కార్పొరేట్ స్థాయి విద్య అభ్యసించేలా వారందరికీ సాంకేతిక విద్యతోపాటు కన్నడ, తమిళం, ఉర్దూ ఇతర మైనార్టీ భాషల విద్యార్థులకు పాఠ్యాంశాలు సులభంగా అర్థమయ్యేలా బైలింగ్యువల్ విధానాన్ని అమలుచేస్తోంది.

బైలింగ్యువల్ విధానం అంటే..

రాష్ట్రానికి తమిళనాడు, ఒరిస్సా, కర్ణాటక రాష్ట్రాలు సరిహద్దులుగా ఉండడంతో ఆ భాషలు చదివే వారితో పాటు, ఉర్దూ చదివే వారు మన దగ్గర ఉన్నారు. దీంతో ఉర్దూ పాఠశాలలను కూడా ప్రభుత్వం నడుపుతోంది. ప్రస్తుతం తమిళం, కన్నడ, ఉర్దూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల కోసం ఇంగ్లిష్, ఉర్దూ, కన్నడ ఇలా రెండు భాషల్లో పాఠ్య పుస్తకాలను ప్రత్యేకంగా ముద్రించారు. పుస్తకంలో ఓ వైపు మాతృభాష, మరోవైపు వారు ఎంచుకున్న భాషలో పాఠ్యాంశాలు ఉండేలా చర్యలు తీసుకున్నారు. పాఠశాలలో పనిచేస్తున్న తమిళ, కన్నడ, ఉర్దూ ఉపాధ్యాయులు ఇంగ్లిష్‌తో పాటు మాతృభాషలో విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించేలా రూపకల్పన చేశారు. తమిళనాడుకు సమీపంలో ఉన్న నగరి నియోజకవర్గంలో తెలుగు, తమిళం, ఉర్దూ భాషలను ఎంచుకున్నవారు ఉన్నారు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా ఇతర భాషలు మాతృభాషగా కలిగిన విద్యార్థులు 85,489 మంది చదువుతున్నట్లు అధికారులు గుర్తించారు. వీరంతా ప్రభుత్వం తీసుకున్న బైలింగ్యువల్ విధానంతో చక్కగా చదువుకుంటున్నారు.

సులభంగా అర్థం అవుతున్నాయి..



నేను వేలావడి ఉర్దూ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాను. మా పాఠశాలలో ప్రస్తుతం బైలింగ్యువల్ విధానంలో ఉర్దూతో ఇంగ్లిష్‌ను పోల్చుతూ రెండు భాషల్లో బోధించడం వల్ల పాఠ్యాంశాలు సులభంగా అర్థమవుతున్నాయి.

– ఎస్.సజానా, విద్యార్థిని

బాగా అవగాహన చేసుకుంటున్నాం



నేను చింతలపట్టెడ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నారు. తమిళం నా మాతృభాష, మా పాఠాలలో ప్రస్తుతం బైలింగ్యువల్ విధానంలో తమిళంను ఇంగ్లిష్‌తో పోల్చుతూ రెండు భాషల్లో బోధించడం వల్ల పాఠాలను బాగా అవగాహన చేసుకోగలుగుతున్నాం.

– దివ్య, విద్యార్థిని

బైలింగ్యువల్ విధానం భేష్



ప్రస్తుతం విద్యార్థులకు అందించిన బైలింగ్యువల్ పుస్తకాలు భేష్. మిర్రర్ ఇమేజ్ పుస్తకాల ద్వారా ఇంగ్లిష్ భాషలో బోధించడానికి చాలా సులభంగా ఉంది. విద్యార్థులు మాతృభాషలో నైపుణ్యం పెంచుకోవడంతో పాటు ఇంగ్లిష భాషలో నైపుణ్యం పెంచుకోవడానికి చాలా ఉపయోగకరంగా ఉంది. ఏ సమస్య లేకుండా ఉపాధ్యాయులు బోధిస్తున్నారు.

– ఎస్.సుప్రియ, ఉర్దూ టీచర్, వేలావడి ఉర్దూ పాఠశాల

విద్యావ్యవస్థలో సమూల మార్పులు



విద్యావ్యవస్థలో ప్రభుత్వం సమూల మార్పులు తీసుకువచ్చింది. విద్యార్థులకు ప్రస్తుతం అందిస్తున్న బైలింగ్యువల్ పాఠ్యపుస్తకాలు చాలా బాగా ఉపయోగపడుతున్నాయి. మాతృభాషతో పాటు ఇంగ్లిష్‌లో కూడా ముద్రించడంతో ఉపాధ్యాయులు వీటిని విద్యార్థులకు సులభంగా బోధన చేయగలుగుతున్నారు.

– శ్రీదేవి, ఎంఈఓ, నగరి

శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ


పవిత్రాల ఊరేగింపు

పుత్తూరు రూరల్: అప్పలాయగుంటలో టీటీడీ అనుబంధ శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాల్లో భాగంగా రెండో రోజు బుధవారం శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. తెల్లవారు జామున శ్రీస్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి శుద్ధి, తోమాలసేవ, అర్చన నిర్వహించారు. ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యులు ఆధ్వర్యంలో యాగశాలలో వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీప్రసన్న వేంకటేశ్వర స్వామి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం వేదోక్తంగా చేపట్టారు. పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో విశేషంగా అభిషేకించి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం మూలవిరాట్‌కు, ఉత్సవర్లకు, పద్మావతీ, ఆండాళ్ అమ్మవార్లకు, జయ విజయులకు, గరుడాళ్వార్‌కు, ఆంజనేయస్వామికి, ధ్వజస్తంభం, ఇతర పరివార దేవతలకు పవిత్ర సమర్పణ గావించారు. సాయంత్రం యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఏఈఓ రమేష్, సూపరింటెండెంట్ శ్రీవాణి పర్యవేక్షించారు.

పవిత్రోత్సవాల్లో నేడు

మూడవ రోజు ఉదయం 9–30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు.11–30 నుంచి 12–30 గంటల మధ్య మహాపూర్ణాహుతి, పవిత్ర విసర్జన నిర్వహించనున్నట్లు ఏఈఓ రమేష్ తెలిపారు.

మండల అభివృద్ధికి సహకరించండి

- ఎంపీపీ లత


మాట్లాడుతున్న ఎంపీపీ లత

కార్వేటినగరం: మండల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని ఎంపీపీ లత కోరారు. బుధవారం మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలవ్యాప్తంగా జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన సమస్యలను ఇప్పటికే 80 శాతం పరిష్కరించడం జరిగిందన్నారు. మిగిలిన 20 శాతం పనులను నవంబర్ 15 నాటికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఇరిగేషన్ ఏఈ రవిప్రకాష్ మాట్లాడుతూ కృష్ణాపురం జలాశయం కింద కుశస్థలి నదిపై కత్తెరపల్లి వద్ద కొత్త ట్యాంకు మంజూరైందని, అలాగే జలాశయం సమీపంలో మరో ఇరిగేషన్ పని మంజూరైనట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ నాడు–నేడు కింద రూ.13 కోట్లు నిధులు మంజూరయ్యాయని, అందులో రూ.8 కోట్లు ఖర్చు కాగా, మిగిలిన మొత్తాన్ని నవంబర్ 15 లోపు అభివృద్ధి పనులకు వెచ్చిస్తామన్నారు. బడి ఈడు పిల్లలను బడిలో ఉండే విధంగా చూడాలని, ప్రజా ప్రతినిధులు పూర్తి సహకారం అందించాలని కోరారు. అనంతరం విద్యుత్ ఏఈ రియాజ్ మాట్లాడుతూ డిప్యూటీ సీఎం ఆదేశాల మేరకు గాజంకి, కత్తెరపల్లి, కార్వేటినగరం పెద్ద దళితవాడలో అదనపు లోడుతో కూడిన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామని చెప్పారు. దీంతో స్పందించి ఎంపీపీ లత గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఇనుప విద్యుత్ స్తంభాలను తొలగించి వాటి స్థానంలో సిమెంట్ విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనంతరం ఎంపీడీఓ మోహన్‌మురళి మాట్లాడుతూ జగనన్న పక్కాగృహాలను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

గైర్హాజరు అయిన వారిపై చర్యలు తప్పవు

మూడు నెలలకు ఒకసారి జరిగే మండల సర్వసభ్య సమావేశానికి కొన్ని శాఖలకు సంబంధించిన అధికారులు గైర్హాజరు కావడంపై ఎంపీపీ లత ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి అధికారి సమావేశానికి హాజరు కావాలని చెప్పినా కూడా డుమ్మాకొట్టడం ఏంటని, వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు లోకనాథరెడ్డి, ఏపీఓ జాహ్నవి, ఏపీఎం విజయకుమార్, డీటీ లీలావతి, ఇతర శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

బాలికల హక్కులను పరిరక్షించాలి


సదస్సులో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ వీరయ్య

పుత్తూరు రూరల్: బాలికలు అన్ని రంగాల్లో రాణించాలంటే ముందుగా వారి హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని స్థానిక ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ వీరయ్య అన్నారు. బుధవారం కళాశాలలో మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ వీరయ్య మాట్లాడుతూ బాలికలకు, మహిళలకు రక్షణ కవచంగా ఉన్న చట్టాలపై విరివిగా అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉందన్నారు. ప్రపంచాన్నే మార్చగల శక్తి సామర్థ్యాలు కలిగిన బాలికలకు తగిన ప్రోత్సాహం అందించాల్సి ఉందని తెలిపారు. అమ్మాయిలు అన్ని రంగాల్లో ఉన్నత శిఖరాలు అధిరోహించడానికి స్ఫూర్తిని నింపుతూ ఐక్యరాజ్య సమితి ఏటా అక్టోబర్ 11న అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో సదస్సు కన్వీనర్ శ్రీదేవి, అధ్యాపకులు ఎం.నరసింహులు వాణిశ్రీ, గాయత్రి, పద్మావతి, షర్మిల, కుమారశ్రీదేవి, సావిత్రి, వరలక్ష్మి పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుపై అవగాహన

నింద్ర: తిరుపతి రాస్ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని పలువురు రైతులకు చిరుధాన్యాల పంటల సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని మంగళగిరి కండ్రిగ, అత్తూరు గ్రామాల్లో జరిగిన సమావేశాల్లో శాస్త్రవేత్త శ్రీనివాసులు మాట్లాడుతూ చిరుధాన్యాలు సాగు చేయడం వల్ల కలిగే లాభాలను వివరించారు. వాటిలో పోషక విలువలు అధికంగా ఉంటాయన్నారు. ముఖ్యంగా రాగులు, సజ్జలు, జొన్నలు తినడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి వివరించారు. అనంతరం చిరుధాన్యాలపై మహిళా రైతులకు క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు.

వేమన పద్యాలపై పిల్లలకు పోటీలు

వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లం జెడ్పీ హైస్కూల్ ప్లస్‌లో బుధవారం వేమన పద్యానికి పట్టాభిషేకం కార్యక్రమంలో భాగంగా పిల్లలకు పోటీలు నిర్వహించారు. తిరుపతి బాలోత్సవం, వేమన విజ్ఞాన కేంద్రం సంస్థ అధ్యక్షుడు నారాయణ ఆధ్వర్యంలో పిల్లలకు వివిధ రకాల పోటీలు నిర్వహించినట్లు ఎంఈఓ మహేశ్వరరావు తెలిపారు. విద్యార్థులకు వేమన పద్య పఠనం, భావం చెప్పడం, చూడకుండా రాయడం వంటి పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో తిరుపతి ఆకాశవాణి డైరెక్టర్ ఆకుల మల్లేశ్వరరావు, హెచ్‌ఎం లీలావతి, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా పెద్దిరెడ్డి జన్మదిన వేడుకలు


కార్వేటినగరం: కేక్ కట్ చేస్తున్న డిప్యూటీ సీఎం కుమార్తె కృపాలక్ష్మి


కేక్ కట్ చేస్తున్న జెడ్పీటీసీ రమణప్రసాద్‌రెడ్డి


కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కార్వేటినగరం: రాష్ట్ర విద్యుత్, అటవీశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి కుమార్తె కృపాలక్ష్మి, ఎంపీపీ లత కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మండల కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు లోకనాథరెడ్డి, దాము, రాజగోపాల్‌రెడ్డి, పద్మనాభశెట్టి, శ్రీనివాసులు, ఏకాంబరం, మురగయ్య, గోపి, పురుషోత్తంరాజు, లోకనాథనాయుడు, మోహన్‌నాయుడు, అమీద్, మునికృష్ణ, శేషాద్రి, ఎంపీటీసీ శ్రీనివాసులురెడ్డి, అర్జునయ్య, సుబ్రమణ్యం పలువురు పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురం : మండలం కేంద్రంలో బుధవారం జెడ్పీటీసీ రమణప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆలయంలో మంత్రి పేరిట ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భారీ కేక్‌ను కట్ చేశారు. అలాగే పాఠశాల విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, విద్యాసామగ్రిని వితరణ చేసి అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మణి, నాయకులు జనార్ధన్, కుప్పయ్య, ప్రమీల, యోగనందం, బాబు, బాల పాల్గొన్నారు.

వెదురుకుప్పం: మండలంలోని బ్రాహ్మణపల్లెలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి ఆధ్వర్యంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ముందుగా కేక్ కట్ చేసి స్వీట్లు పంచి పెట్టారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సుకుమార్, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ బట్టే సుబ్రమణ్యం, కో–ఆప్షన్ సభ్యుడు వెంకటేష్ పాల్గొన్నారు.

పెనుమూరు(కార్వేటినగరం) : రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మండల కన్వీనర్ విజయకుమార్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఘనంగా జరుపుకున్నారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ హరికృష్ణ, మండల ప్రచార కమిటీ అధ్యక్షుడు యతీశ్వర్ నాయుడు, ఆర్యవైశ్య సంఘం మండలాధ్యక్షుడు రోహిణిప్రసాద్, సచివాలయ కన్వీనర్ హరి, సురేష్ రెడ్డి, యుగంధర్ పలువురు పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధిపై సమీక్ష


మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రేమ్‌రాజ్ కుమార్

పాలసముద్రం : మండల పరిధిలోని పంచాతీయల్లో అభివృద్ధి పనులు చేయడానికి ప్రణాళిక చేపట్టాలని ఎంపీడీఓ ప్రేమ్‌రాజ్ కుమార్ తెలిపారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ ఉద్యోగులు, ఉపాధిహామీ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. పంచాయతీ డెవలప్‌మెంట్ ఇండెక్స్ పీడీఐ ఎస్‌డీజీ గోల్స్ 24 శాఖలకు సంబంధించిన సమాచారాలను సేకరించి ఆన్‌లైన్‌లో పెట్టాలని తెలిపారు. ఉపాధిహామీ పథకంలో ప్రభుత్వం భూములు ఉన్న ప్రదేశాలు, పాఠశాలలు, సచివాలయాలు, పంచాయతీ భవనం వంటి ఖాళీగా ఉన్న ప్రదేశాల్లో మొక్కలు పెంపకం కార్యక్రమం చేపట్టాలని తెలిపారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో పారిశుద్ధ్య లోపం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. పారిశుద్ధ్య కార్మికులతో ఇంటి పరిసరాల్లో వర్షపు నీటిని తొలగించి మలాథిన్ మందు పిచికారీ చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లాలని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల విస్తరణాధికారి రమేష్, ఏపీఓ మార్గేట్ పాల్గొన్నారు.

'మంత్రి రోజమ్మ మేలు మరువలేం'


పుత్తూరు ఆస్పత్రిలో భోజనం తింటున్న గర్భిణులు

పుత్తూరు రూరల్: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో బుధవారం పరీక్షల నిమిత్తం వచ్చిన గర్భిణులు 'రోజా చారిటబుల్ ట్రస్ట్' ఆధ్వర్యంలో పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. పరీక్షల నిమిత్తం వేచి ఉండే సమయంలో గర్భిణులు భోజనానికి ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా పుత్తూరు, నగరి ప్రభుత్వ ఆస్పత్రుల్లో పౌష్టికాహార పంపిణీ కార్యక్రమాన్ని ప్రతి బుధవారం నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో చికిత్స నిమిత్తం వచ్చిన గర్భిణులకు, వారి సహాయకులకు వెజిటబుల్ పలావ్, వైట్ రైస్, గుడ్లు, కరీస్, పచ్చడి, సాంబారు, రసం, పెరుగు అన్నం, చిక్కీ, అరటిపండు అందించారు. ఈ సందర్భంగా గర్భిణులు మాట్లాడుతూ ప్రతి బుధవారం కడుపు నిండా మంచి భోజనం పెడుతున్న మంత్రి రోజమ్మ రోజు మేలు మరువలేమన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు ప్రకాష్, శంకర్, హాస్పిటల్ డెవలప్‌మెంట్ మెంబర్లు నారాయణస్వామి, పుష్ప, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

దైవం మానవరూపం


దివ్యాంగుడు శివలింగానికి మూడు చక్రాల సైకిల్ అందిస్తున్న మంత్రి ఆర్కేరోజా

నగరి: 'తోటివారికి సాయపడడానికి భగవంతుడు ప్రత్యక్షంగా రాకపోయినా మానవరూపంలో తోడవుతాడని విన్నాను.. నేడు అది కళ్లారా చూశాను' అంటూ కేవీపీఆర్ పేటకు చెందిన దివ్యాంగుడు శివలింగం మంత్రి ఆర్కేరోజా ఎదుట భావోద్వేగం వ్యక్తం చేశాడు. మంత్రి ఇటీవల నగరి మున్సిపల్ పరిధిలోని కేవీపీఆర్ పేటలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తుండగా, ఆ సమయంలో దేక్కుంటూ వచ్చిన దివ్యాంగుడు శివలింగం తనకు మూడు చక్రాల సైకిల్ అందించాలని కోరాడు. అతని పరిస్థితిని అర్థం చేసుకున్న మంత్రి రోజా బుధవారం తన నివాసం వద్దకు అతన్ని రప్పించి మూడు చక్రాల సైకిల్‌ను అందించారు. దీంతో శివలింగం ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఆనంద భాష్పాలు రాలుస్తూ మంత్రికి కృతజ్ఞతలు తెలిపాడు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం అంటే ఏదో ఎన్నికల కోసం చేసే పర్యటన కాదని అది అభాగ్యులకు సాయం అందించడానికి ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన మహత్తర కార్యక్రమమని మరోసారి నిరూపితమైంది.

ప్రతి కుటుంబానికీ ఆరోగ్య భద్రత


పౌష్టికాహార స్టాల్‌ను సందర్శిస్తున్న ఎంపీపీ లత

- జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు పోటెత్తుతున్న జనం
- కార్యక్రమం విజయవంతానికి ప్రజాప్రతినిధులు, అధికారుల కృషి


గంగాధరనెల్లూరులో..


రోగులకు కేస్ షీట్లను అందిస్తున్న ఎంపీపీ లత


విజయపురంలో..

కార్వేటినగరం: రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడానికి, ఆదర్శంగా ఉంచాలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయమని ఎంపీపీ లత అన్నారు. బుధవారం మండల పరిధిలోని అమ్మపల్లి సచివాలయ ఆవరణలో సర్పంచ్ భారతి ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలె ఎంపీపీ పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో స్పెషలిస్టు వైద్యులతో వైద్యం అందించడంతో పాటు ఉచితంగా మందులు, మెరుగైన వైద్యం అవసరం అయిన వారిని ఆరోగ్యశ్రీ, నెట్‌వర్క్ ఆస్పత్రులకు సిఫార్సు చేసి కార్పొరేట్ స్థాయిలో వైద్యసేవలు అందిస్తున్న సీఎం జగనన్నకు ప్రజలు రుణపడి ఉండాలని కోరారు. అంగన్‌వాడీ సిబ్బంది ఏర్పాటు చేసి పౌష్టికాహార స్టాల్ చూపరులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, ఇతర నాయకులు, అధికారులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పెనుమూరు(కార్వేటినగరం): మండలంలోని సామిరెడ్డిపల్లి సచివాలయ ఆవరణలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి విచ్చేసిన రోగులకు వైద్యులు మెరుగైన వైద్యసేవలు అందించడంతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరంలో ఐసీడీఎస్ సిబ్బంది ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్ ఆకట్టుకుంది. కార్యక్రమంలో మండల కన్వీనర్ విజయకుమార్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ బండి కమలాకర్‌రెడ్డి, వైద్యాధికారి హర్షవర్ధన్‌రెడ్డి, ఐసీడీఎస్ పర్యవేక్షకులు భాగ్యలక్ష్మి, వైద్యసిబ్బంది, సర్పంచ్ మురళీకుమార్ రెడ్డి, ఎంపీటీసీ జమున తదితరులు పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురం : మండలంలోని వెంకటాపురం సచివాలయ పరిధిలో ఉన్న చిల్లామాకులపల్లి ఉన్నత పాఠశాలలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించినట్లు జెడ్పీటీసీ రమణప్రసాద్ రెడ్డి తెలిపారు. శిబిరంలో 630 మంది రోగులకు వైద్యసేవలు అందించి, ఉచితంగా మందులు అందజేశారని చెప్పారు. అలాగే కంటి చూపుతో బాధపడుతున్న 53 మందికి కంటి అద్దాలను అందించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచులు అనిత, విజయ, చిట్టి, ఎంపీటీసీ ఏసమ్మ, మండల కన్వీనర్ మణి, వైద్యసిబ్బంది నాయకులు పాల్గొన్నారు.

గంగాధర నెల్లూరు: మండలంలోని కొత్త వెంకటాపురం గ్రామ సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపును బుధవారం ఎంపీడీఓ శ్రీదేవి ప్రారంభించారు. పేద ప్రజలకు ఒక్క రుపాయి ఖర్చు లేకుండా తమ గ్రామంలోనే స్పెషలిస్ట్ డాక్టర్లచే అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి తగిన మందు మాత్రలు పంపిణీ చేశారు. మెరుగైన వైద్యం అవసరమైన వారికి పెద్దాస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా చికిత్స అందుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కనకమ్మ, ఎంపీటీసీ లారెన్స్, వైద్యబృందం పాల్గొన్నారు.

వెదురుకుప్పం: జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరమని జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్ అన్నారు. బుధవారం మండలంలోని బ్రాహ్మణపల్లెలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్యసిబ్బంది రోగులకు వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, ఎంపీడీఓ సుధాకరరావు, డాక్టర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నింద్ర: జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా నిరుపేదల ప్రజలకు ఎంతో సౌకర్యమని ఎంపీపీ దీప అన్నారు. బుధవారం మండలంలోని ఇరుగువాయి గ్రామంలో నిర్వహించిన ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. శిబిరంలో రోగులకు వైద్య పరీక్షలు చేసి, 30 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. వైద్యపరీక్షలు చేసుకున్న వారికి హెల్త్‌కార్డులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అరుణ, తహసీల్దార్ భగవతి, మండల సచివాలయ కన్వీనర్ బాబురెడ్డి, సర్పంచ్ రాజేష్, ఎంపీటీసీ సభ్యులు మంజుల, కోఆప్షన్ సభ్యులు అనిల్, మండల కన్వీనర్ వేణురాజు, వైద్యాధికారి కల్యాణి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు రూరల్: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష పథకం పేదలకు ఓ వరం లాంటిదని వడమాలపేట మాజీ జెడ్పీటీసీ సురేష్‌రాజు అన్నారు. బుధవారం వడమాల సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సామాన్యులకు సైతం కార్పొరేట్ వైద్యం అందించాలన్నదే సీఎం జగనన్న లక్ష్యమన్నారు. శిబిరంలో 72 మందికి హెల్త్ కార్డులు, 10 మందికి కంటి అద్దాలు అందజేశారు. 283 మంది సాధారణ చికిత్స చేసుకోగా, 106 మంది ప్రత్యేక వైద్య నిపుణులచే వైద్యసేవలు అందుకున్నారు. వీరిలో 11 మందిని మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. 70 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 9 మందిని ఆపరేషన్ నిమిత్తం తిరుపతికి పంపించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచులు అంజమ్మ, శ్రీవిద్య, మునెమ్మ పాల్గొన్నారు.

విజయపురం (నగరి): ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతోనే రాష్ట్ర ముఖ్యమంత్రి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం తీసుకొచ్చారని డాక్టర్ సోమశేఖర్ అన్నారు. బుధవారం కృష్ణసముద్రం సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టారు. సుమారు 700 మందికి వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమం పేదలకు ఎంతో ప్రయోజకరంగా మారిందన్నారు. ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వైద్య పరీక్షలు చేయించుకుని ఆరోగ్యంగా ఉండాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ విష్ణుప్రియ, సౌందర్య, తిరులేష్, భార్గవి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.